www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 డిసెంబర్ 2025

నేడు డిప్యూటీ సిఎం పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గురువారం చిత్తూరులో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పట్లను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ 4వ తేదీ గురువారం చిత్తూరులోని డివిజినల్ లెవెల్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయ ప్రారంభోత్సవానికి డిప్యూటి సిఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఎస్పీ అధికారులకు పలు సూచనలు చేస్తూ ఉప ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అంతరాయం లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమం ప్రాంగణం, రూటు మ్యాప్, పార్కింగ్ ప్రాంతాలు, జనసంచారం ఎక్కువగా ఉండే కీలక కూడళ్ల వద్ద అదనపు సిబ్బందిని మోహరించాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్‌ను ముందుగానే ప్రజలకు తెలియజేయడంతో పాటు, ఆ ప్లాన్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వీఐపీ రూట్‌పై చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసి ప్రతి పాయింట్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమ స్థలంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో సమగ్ర తనిఖీలు నిర్వహించి ఏ విధమైన భద్రతా లోపాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. అలాగే మెడికల్ టీమ్, అగ్ని మాపక సిబ్బంది, ఎమర్జెన్సీ వాహనాలను స్టాండ్‌బైలో ఉంచి ఏ పరిస్థితినైనా తక్షణమే నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం మొత్తం వ్యవధిలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ నిరంతరంగా చేయాలన్నారు. చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ టి.సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఎస్‌బి. ఇన్స్పెక్టర్ మనోహర్, చిత్తూరు 2 టౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య, క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ ఎంటిఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

జిల్లాలో స్క్రబ్ టైఫస్ అలర్ట్..

- జనాన్ని వణికిస్తున్న చిన్న పురుగు
- అప్రమత్తత అవసరమంటున్న వైద్యశాఖ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రస్తుతం స్క్రబ్ టైఫస్ జిల్లాను వణికిస్తోంది. ఈ వ్యాధి ఓరియంటియా సుత్సుగముషి జాతికి చెందిన బ్యాక్టీరియా, స్క్రబ్ టైఫస్ కీటకాల కాటు ద్వారా వ్యాపిస్తుంది, వీటిని చిగ్గర్స్ అని పిలుస్తారు. ఈ కీటకాలు సాధారణంగా పొదలు, గడ్డి, అటవీ ప్రాంతాల్లో కనిపిస్తాయి. ఈ వ్యాధి పిల్లలు, పెద్దలు ఎవరికైనా వచ్చే అవకాశాలున్నాయి. స్క్రబ్ టైఫస్ సోకిన వారిలో జ్వరం, తలనొప్పి, అలసట, ఒంటిపై దద్దుర్లు వస్తాయి. చిగ్గర్ కాటు వేసిన ప్రాంతంలో నల్లగా స్కబ్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రమైతే స్క్రబ్ టైఫస్ న్యుమోనైటిస్, మెనింజైటిస్, గుండె వైఫల్యం వంటి సమస్యలకు దారితీస్తుంది. కొన్ని సందర్భాల్లో అవయవ వైఫల్యానికి కూడా కారణమవుతుంది. పెంపుడు జంతువుల్లో కూడా స్క్రబ్ టైఫస్‌ను వ్యాధిని వ్యాపించే పురుగులు కనిపిస్తాయి. చిగ్గర్ ఆవాసాలను తగ్గించడానికి నివాస ప్రాంతాల చుట్టూ ఉన్న స్క్రబ్ వృక్షాలను క్రమం తప్పకుండా క్లియర్ చేయాలని, ఎలుకలు చిగ్గర్‌లకు సాధారణ హోస్ట్‌లుగా వ్యవహరిస్తాయి. వ్యక్తిగత రక్షణ చర్యలు ముఖ్యం.

స్క్రబ్ టైఫస్ చికిత్స

స్క్రబ్ టైఫస్ వ్యాధి కనుగొన్న వెంటనే డాక్సిసైక్లిన్, అజిత్రోమైసిన్‌తో చికిత్స తీసుకోవాలని, అలాగే డాక్టర్లు చెప్పేంతవరకు చికిత్స పూర్తిగా చేయించుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి స్క్రబ్ టైఫస్ రాకుండా జాగ్రత్త తీసుకోవాలని ఐడిఎస్ పిపిఓ డాక్టర్ అనిల్ కుమార్, ఎపిడిమీయాలజిస్ట్ శ్రీవాణి తెలిపారు.

అప్రమత్తంగా ఉన్నాం..

- డాక్టర్ సుధారాణి, డిఎం అండ్‌హెచ్‌ఓ

స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉన్నాం. వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధి లక్షణాలున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి, జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతోంది.



విద్యాభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకం

ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్‌ను ఆవిష్కరించిన యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్

ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యాభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకమైనదని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నిరంతరం పాటుపడుతున్నదని పేర్కొన్నారు. హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించిన సంఘంగా యుటిఎఫ్ రాణిస్తున్నదన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల క్షేమం గురించి కూడా ఆలోచించడం ఒక్క యుటిఎఫ్‌కు మాత్రమే సాధ్యమన్నారు. అందులో భాగంగానే పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రతి ఏడాది మోడల్ పేపర్‌ను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తుండడం అభినందనీయమన్నారు. విషయ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులచే తయారు చేయబడిన ఈ మోడల్ పేపర్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నదన్నారు. పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రంలో 80శాతం వరకు మోడల్ పేపర్‌లోని ప్రశ్నలే వస్తున్నాయంటే మోడల్ పేపర్‌ను రూపొందించే ఉపాధ్యాయుల విషయ నైపుణ్యం అద్భుతమని కొనియాడారు. ఈ మోడల్ పేపర్స్‌ను విద్యార్థులు చక్కగా చదివితే పదవ తరగతిలో అద్భుత ఫలితాలు వారి సొంతమన్నారు. పదవ తరగతి లోని అన్ని గ్రేడుల వారికి ఈ మోడల్ పేపర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యుటిఎఫ్ చేస్తున్న ఈకృషిని విద్యార్థులు చక్కగా ఉపయోగించు కోవాలని ఆయన కోరారు. రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, జీవీ.రమణ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని అందులో భాగంగానే ప్రతి ఏడాది నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులచే మోడల్ ప్రశ్నాపత్రాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. మోడల్ పేపర్స్ కావలసినవారు 94908 25982, 97059 70098, పలమనేరు 98852 24232, కుప్పం 94942 10300ను సంప్రదించాలన్నారు. జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, జిల్లా గౌరవధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, సహధ్యక్షులు ఎస్.రెహానా బేగం, కె.రెడ్డెప్ప నాయుడు, కోశాధికారి కె.ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శులు సీపీ ప్రకాష్, ఏ.కృష్ణ మూర్తి, కె.సరిత, పాల్గొన్నారు.

గాయపడిన ఒంటరి ఏనుగు మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)
చిత్తూరు పశ్చిమ రేంజ్ పారదరామి రిజర్వ్ ఫారెస్ట్ పరిధి గుడ్డివాని చెరువులో గాయాలతో ఎస్వీ జూ పార్కులో వెటర్నరీ డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య సేవలు పొందుతున్న వయోజన మక్నా ఏనుగు బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. గుడ్డివాని చెరువులో కదలలేక తీవ్రంగా గాయపడిన స్థితిలో ఈ 25 ఏళ్ల ఏనుగును అటవీ, ఎస్వీ జూ పార్కు బృందాలు రెస్క్యూ చేసి ఒకటవ తేదీన ఎస్వీ జూ పార్కుకు తరలించారన్నారు. గాయాలు మానడానికి వెటర్నరీ డాక్టర్లు చేసిన వైద్యసేవల ప్రయత్నాలకు ఏనుగు శరీరం సహకరించక పోవడం, ఏనుగుల గుంపులో జరిగిన కొట్లాటలో తీవ్రంగా గాయపడడం, రక్తం విషపూరితంగా మారిపోవడంతో ఏనుగు మృతి చెందినట్లు చెప్పారు. ఏనుగు కళేబరాన్ని ఎస్వీ జూ పార్కు ఆవరణలో చిత్తూరు అటవీ శాఖ అధికారులు, ఎస్వీ జూ పార్కు క్యురేటర్, పశువైద్య బృందాల సమక్షంలో ఖననం చేశామన్నారు.

మాజీ సైనికుల పెన్షన్ సమస్యలు

ఆన్‌లైన్ ద్వారా పరిష్కారం : డీఆర్‌వో

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సచివాలయంలోని పిజిఆర్ఎస్ నూతన భవనంలో డిఆర్ఓ కే.మోహన్ కుమార్ సిస్టం ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ – రక్ష (స్పర్శ్) కార్యక్రమాన్ని కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్‌కు సంబంధించిన సీనియర్ ఆడిట్ ఆఫీసర్ కెవి.రమణ, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ.రాఘవులు, ఆడిట్ అకౌంట్స్ ఆఫీసర్ ఎస్‌వి శ్రీరామ మూర్తి, ఆడిట్ అకౌంట్స్ ఆఫీసర్ జి.మహేష్‌బాబు, అసిస్టెంట్ డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్ డాక్టర్ కెప్టెన్ సత్య ప్రసాద్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ సిస్టం ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ – రక్ష (స్పర్శ్) రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించబడిన ఒక ఆధునిక డిజిటల్ ప్లాట్ఫామ్ ద్వారా సైనిక పెన్షన్ సంబంధిత అన్ని సేవలు పిపిఓ విడుదల, సవరణలు, గ్రీవెన్స్ పరిష్కారం మొదలైనవి పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా సులభతరం చేయబడ్డాయని తెలిపారు. బుధవారం చిత్తూరు జిల్లాలో మాజీ సైనికులు ఆధారితుల పెన్షన్ సంబంధిత సమస్యలను నేరుగా అధికారులతో పరిష్కరించడం జరిగిందన్నారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రామ్ ద్వారా తమ పెన్షన్ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

పాఠశాల బస్సులు తనిఖీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని బృందావన్ పాఠశాలలో బుధవారం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జిఎస్‌వి.రాజేశ్వరరావు పాఠశాలలోని బస్సులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాటిని నడుపుతున్న డ్రైవర్లకు రహదారి నియమాల గురించి, తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అలాగే బస్సులో జరిగే ఫైర్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ తనిఖీలలో పాఠశాల అధ్యక్షులు విజయ భాస్కర్ పాల్గొన్నారు.

శక్తి యాప్ ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం, శక్తి యాప్ ప్రాముఖ్యతపై చిత్తూరు జిల్లా మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం బిఎస్.కన్నన్ ప్రభుత్వ కళాశాలలో మహిళా స్టేషన్ ఎస్ఐ కరీమునిస్సా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు పౌరులని, చిన్న వయస్సు నుంచే మంచి చెడు తెలియాలని అన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గుర్తించాలని, ఎవరి వల్ల అయినా అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు, టీచర్‌కు తెలిపాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112 (ఎమర్జెన్సీ నంబర్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) నంబర్లకు సమాచారం అందిస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారని తెలిపారు.

ముగిసిన 12వ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు

జాతీయ పోటీలకు 24 మంది క్రీడాకారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:
చిత్తూరు నగరంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 12వ రాష్ట్రస్థాయి సీనియర్ కుస్తీ పోటీలు బుధవారం ముగిశాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్, బాలికల ఫ్రీ స్టైల్ పోటీలకు 125 మంది బాలురు, 50మంది బాలికలు పాల్గొన్నారు. మూడు విభాగాలకు చెందిన క్రీడాకారులు పోటాపోటీగా విజయం కోసం హోరాహోరీగా తలపడ్డారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి ఆర్కే పురుషోత్తం మీడియాతో మాట్లాడారు. 3 విభాగాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి బంగారు పతకానికి ఎంపికైన 24 మంది కుస్తీ క్రీడాకారులు ఈనెల 12, 13, 14 వ తేదీల్లో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాదు నగరంలోని నేషనల్ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. రెజ్లింగ్ క్రీడకు సంబంధించి ప్రపంచస్థాయిలో భారతదేశానికి మంచి పేరు ఉందని, దేశంలో ప్రపంచ స్థాయి కుస్తీ క్రీడాకారులు ఉండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా 2008వ సంవత్సరం నుంచి రెజ్లింగ్ విభాగంలో భారతదేశానికి క్రమం తప్పకుండా పతకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో ఏపీఓఏ రాష్ట్ర కోశాధికారి ఆర్.శ్రీనివాసన్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా కార్యదర్శి టీఆర్ కుమార్, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సుదర్శన్ రెడ్డి, స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఎన్ వెంకటస్వామిరెడ్డి, పలువురు మ్యాచ్ రెఫరీలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల పట్ల శ్రద్ధ చూపాలి

దివ్యాంగులకు మనోధైర్యం ఇవ్వాలి: జిల్లా ఎస్పీ

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా చిత్తూరు పట్టణంలోని బీసీ భవన్‌లో అత్యంత స్ఫూర్తిదాయకంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి హాజరై దివ్యాంగులతో మాట్లాడి వారి ప్రతిభను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు. ఈకార్యక్రమంలో దివ్యాంగుల కోసం నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో, రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయం సాధించిన ప్రతిభావంతులకు ఎస్పీ బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. దివ్యాంగులు తగిన అవకాశాలు ఇచ్చినప్పుడు ఏ రంగంలోనైనా అద్భుతాలు చేయగలరని ఈ విజేతలు నిరూపించారని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నరేంద్ర పడల్, చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ టి.సాయినాథ్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: ప్రత్యేక ప్రతిభావంతులకు ఆత్మస్థైర్యాన్ని నింపి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమగ్ర శిక్ష పీవో వెంకట రమణ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పీవో మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రత్యేక అవసరాలను ప్రభుత్వం సమకూర్చిన అవకాశాలను అందుపుచ్చుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా 16 మంది విద్యార్థులకు క్రీడాపోటీలు, డ్రాయింగ్ పోటీలు, వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులకు రూ. 7వేలు విలువచేసే టిఎల్ఎం కిట్లు అందించారు. ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ఐఈ కోఆర్డినేటర్ మధు, ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య, ప్రధానోపాధ్యాయులు వసంత, రెడ్డమ్మ, విజయ కుమారి, కళామందిరి, కుమారి, సిఆర్పి కుమారి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: దివ్యాంగులను చిన్నచూపు చూడరాదని ఎంపీడీవో మహేష్ తెలిపారు. బుధవారం భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంను ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు, రమేష్‌బాబు, డైట్ కళాశాల లెక్చరర్ శైలజ, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రపంచ దివ్యంగుల దినోత్సవం ఐఆర్‌టి సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దివ్యాంగులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎంపీడీవో ప్రసాద్, హెచ్ఎం చెంగల్ రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ ఆర్.వెంకట్రామన్ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం రొంపిచెర్ల ఎంపీపీఎస్ తెలుగు పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఎంఈవోలు ఇందిరా, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు అమరశేఖర్, ఉపాధ్యాయులు రఫీబాషా పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో..

బైరెడ్డిపల్లిలో..

తవణంపల్లి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తవణంపల్లి హైస్కూల్ భవిత కేంద్రంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వేణుగోపాల్ రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు.

పలమనేరు: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి లీలారాణి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా శిక్షణ, సంక్షేమ కార్యక్రమాలు అందేటట్లు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు షమేషీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐరాల: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా చిత్తూరులోని జ్యోతిరావ్ పూలే (బిసి) భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డిఆర్ఓ మోహన్ కుమార్ చేతుల మీదుగా మండలానికి చెందిన ఏపీ దివ్యాంగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్ ప్రశంసాపత్రం అందుకున్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మోడల్ ఎలిమెంటరీ స్కూల్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓ జనార్ధన్ రెడ్డి, సుబ్రమణ్యం, మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్ పాల్గొన్నారు

అందరూ ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్వానిధి సంకల్ప అభియాన్ పథకం ద్వారా 966 మంది వీధి విక్రయ దారులకు రూ.2.28 కోట్ల చెక్కును, 9 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.66వేల చెక్కును, అలాగే వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా అన్నివిధాలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను చేపడుతున్నదన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు రావాలని కోరారు. పేదలకు రుణాలను అందించి సహకరించిన పలువురు బ్యాంకర్లను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవిచంద్ర బాబు, మున్సిపల్ కమిషనర్ రమణా రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, మెప్మా సీఎంఎం బాబా పాల్గొన్నారు.

గ్రంథాలయానికి 200 పుస్తకాలు వితరణ

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం గ్రంథాలయానికి డాక్టర్ శిల్పా, డాక్టర్ చైతన్య 200 పుస్తకాలను అందజేశారు. ఊహామాల బొమ్మల కథలు, గుణింతాలు ద్విత్వాక్షరాలతో కథలు, సంయుక్త అక్షరాలతో కథలు, బొమ్మల కథా కథనం తదితర విలువైన పుస్తకాలను అందజేశారు. అదేవిధంగా కవిత్రయి రచించిన శ్రీ మాదాంధ్ర మహాభారత పుస్తకాలను ఉమా నాగరాజ్ వితరణగా అందజేశారు. దాతలు అందించిన పుస్తకాలు చిన్నారులకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రంథాలయ అధికారి సత్యవాణి తెలిపారు. చిన్నారులు పుస్తక పఠనంను అలవాటు చేసుకోవాలని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను క్రమం తప్పకుండా పుస్తకాలు చదివే విధంగా చూడాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సలహాదారుడు మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

పెద్ద చెరువుకు జలహారతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి
హంద్రీ- నీవా జలాలతో బైరెడ్డిపల్లి చెరువు దశాబ్దాల తర్వాత నీటితో నిండి కళకళలాడుతోంది. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి జలహారతి ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం హంద్రీ నీవా నీటిని మళ్లించిందన్నారు. అలాగే ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా నిండని పెద్ద చెరువు నీటి నిండి రెండ్రోజులుగా చెరువు మొరవ పారుతుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో జలహారతి, తెప్పోత్సవం నిర్వహించారు. ఏఎంసి ఛైర్మన్ రాజన్న, టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం శెట్టి, భువనచంద్ర గౌడ్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'రైతన్నా మీకోసం' వర్క్‌షాప్

రైతన్న మీకోసం వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం కార్వేటినగరం మండలంలోని కలికిరి ఇండ్లు, కార్వేటి నగరం గ్రామాలలో రైతన్నా మీకోసం వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం, చిత్తూరు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ కో- ఆర్డినేటర్ డాక్టర్ ఎ.రామకృష్ణా రావు, మండల వ్యవసాయ అధికారి ఆర్.హేమలత, రైతుసేవా కేంద్రం విఎఎలు చైతన్య, సుమ పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులతో ముఖాముఖి చర్చాగోష్టి నిర్వహించి రబీ 2025-26 రాబోయే ఖరీఫ్ 2026, రబీ 2026-27 పంట కాలాలకు గాను కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. అలాగే యూరియాకు ప్రత్యామ్నాయంగా పంటలు జనుము, జీలుగ, అలసంద, పిల్లి పెసర వంటి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ వ్యవసాయ పనిముట్లు, జీవన ఎరువులు, పసుపు రంగు జిగురు అట్టలు, నీలి రంగు జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు అన్నీ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందరికీ అందే విధంగా చూడాలన్నారు. బిసి సంఘం అధ్యక్షులు రవియాదవ్, టిడిపి సీనియర్ నాయకులు వాసుదేవారెడ్డి, జగన్నాథం పాల్గొన్నారు.

సంఘాల ఏర్పాటుతో రైతుల అభివృద్ధి..!

కుప్పం ఏఎంసీ చైర్మన్ రాజు

ప్రజాశక్తి- రామకుప్పం: రైతు సంఘాలుగా ఏర్పాటు చేసేందుకు ఏపీఎం, వెలుగు సీసీలు, ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘ మిత్రులు పరస్పర సహకారంతో కృషి చేసి వారి అభివృద్ధికి తోడ్పాడాలని గురువారం ఏఎంసీ చైర్మన్ రాజు పేర్కొన్నారు. రామకుప్పంలోని మండల కార్యాలయ సమావేశ భవనంలో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీలోని ప్రతి గ్రామంలోనూ రైతు సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు రైతులకు వివరించాలన్నారు. టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, గుర్రప్ప, పట్రా నారాయణ, కామరాజు నాయక్, నరసింహులు, రఘు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు

ఎస్‌విసిఆర్ విద్యార్థి సమీర్ బాషా

ప్రజాశక్తి- పలమనేరు: ఎస్వీ యూనివర్సిటీ ఇంటర్ కోల్ జెట్ వాలీబాల్ టోర్నమెంట్‌కు స్థానిక ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సమీర్ బాషా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం. వెంకటేశులు తెలిపారు. ఈ విద్యార్థి ఈనెల 4వ తేదీ నుంచి ఎస్వీ యూనివర్సిటీలో జరిగే క్యాంపుకు వెళ తున్నారని, అనంతరం కాకినాడ జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీలో 10వతేదీ నుంచి జరగబోయే స్టేట్ మీట్ ఎస్వీ యూనివర్సిటి టీం తరపున పార్టిసిపేట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందేశ్వరయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సుబ్బయ్యనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ విక్రమ్ రాజ్ ఇతర అధ్యాపకులు సమీర్‌ను అభినందించారు.

ఎన్‌సిసి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి- పలమనే రూరల్ (గంగవరం): మదర్ థెరిసా విద్యాసంస్థల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఎన్‌సిసి ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం వారంరోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో అలాగే ఈ గ్రామాలలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ దేవేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం వద్దు..

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి- సోమల: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణాన్ని పెంపొందించే విధంగా మొక్కలు నాటి పచ్చని చెట్లను ఎదిగే విధంగా చూడాలని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఎస్.నడింపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడటం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం కూడా క్షేనిస్తుందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెద్ద చెట్లు ఎదిగేలా చూసి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గౌతమ్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి స్కంధపుష్కరిణీ సమీపంలో కుమార గిరిపై వెలసి ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని బుధవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టి స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలకంరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- పలమనేరు: మండలంలోని పలమనేరు, బైరెడ్డిపల్లి, వి కోట, శాంతిపురం, కుప్పం మండలాల్లో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు అత్యవసర సమయాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉండవచ్చు అని పలమనేరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీవన్ కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో మహదేవ మంగళం నుంచి పలమనేరు వరకు గల 220 కెవి లైన్‌లో మరమ్మతుల వనల అత్యవసర సమయంలో మాత్రం విద్యుత్ అంతరాయం కలిగవచ్చు అని, ప్రజలు సహకరించాలని కోరారు.

రాయితీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి - రొంపిచర్ల: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రొంపిచర్ల మండలంలోని రైతులకు రాయితీపై పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి చల్లా రామచంద్రారెడ్డి ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ వారు రైతులకు 80శాతం రాయితీతో ఉలవలు విత్తనాలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మండలంలో రైతులకు అందుబాటులో ఉండాలని, గ్రామాలలో పర్యటించి సీజన్లో ఎలాంటి పంటలు వేయాలి, ఎలాంటి ఎరువులు ఉపయోగించాలని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా లబ్ధి పొందాలన్నారు. ఎంపీడీవో ఎస్.మధుసూదన్ రెడ్డి, ఏవో శ్రావణి, సర్పంచ్ ఆర్.ఇబ్రహీం ఖాన్, టిడిపి నాయకులు రవి నాయుడు, నూకల నాగార్జున, సింగిల్ విండో చైర్మన్ రఘునాథరెడ్డి, డైరెక్టర్ సురేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ వితరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ చిన్న పోట్టుచేను పాఠశాలకు శ్రీలక్ష్మీ మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ అధినేత ప్రసాద్ బుధవారం స్మార్ట్ టీవీని వితరణగా అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీకి రూ.15వేలు విలువ చేసే స్మార్ట్ టీవీని అందజేశారు. ఈసందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలో చదువుతున్న విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం మరువలేదని అన్నారు. దాతలు పాఠశాల అభివృద్ధికి చేయూత నివ్వాలని కోరారు.

సప్త కనికలమ్మ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక పరిధిలోని దొడ్డిపల్లి శ్రీసప్త కనికలమ్మ దేవాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ఉత్సవాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు పాల్గొన్నారు. స్థానిక ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఆయనకు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాలకృష్ణ, నాయకులు తిరుకుమరన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీకి స్థాపనకు స్థలపరిశీలన

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ, కృష్ణా నగర్ గ్రామం వద్ద మానస సరోవర్ యూనివర్సిటీ ఏర్పాటుకు బుధవారం కూటమి నేతలు, యూనివర్సిటీ బృందం స్థల పరిశీలన చేశారు. గ్రామపరిసర ప్రాంతాలను పరిశీలించి మధ్యప్రదేశ్ భూపాల్ యూనివర్సిటీ స్థాపన నిర్మాణానికి 2 వందల ఎకరాలు అవసరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నేతలు మునిరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మంజునాథ్, యూనివర్సిటీ బృందం పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి సోమల: మండలంలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాలను మండల ప్రత్యేకఅధికారి సూరి బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అలాగే పౌష్టికాహారాన్ని విద్యార్థులకు ఎలా పంపిణీ చేస్తున్నారన్న విషయాలను ఆరా తీశారు. సూరయ్యగారిపల్లి, తుగడంవారి`ల్లి, నంజంపేట1,2 అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన కేంద్రాలలో ఉన్న స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి రిజిస్టర్లలో ఉన్న మేరకు పౌష్టికాహారం పంపిణీ చేశారా నిల్వ ఎంత ఉంది పరిశీలించారు. గ్రామంలో గర్భవతులు, బాలింతలు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి అంగన్వాడీ కేంద్రాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం నాణ్యమైన విద్య అందించాలన్న ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారులను అంగన్వాడీలకు రప్పించే విధంగా చేస్తోందని చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా గర్భవతులు బాలింతలకు పాలు, గుడ్లు అందే విధంగా చూడాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో సిడిపిఓ రాజేశ్వరి, సూపర్వైజర్ హరిత, అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట నివారించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రైల్వేస్టేషన్‌కు ఉదయం ట్రైన్లన్నీ ఒకేసారి రావడంతో ప్రయాణికులు తొక్కిసలాటతో ఇబ్బంది పడుతున్నారని, దీన్ని నివారించాలని సిపిఎం మాజీ ఎంపి పెనుమల్లి మధు సూచించారు. తొక్కిసలాట వల్ల ప్రయాణికులు గాయపడే ప్రమాదం ఉందన్నారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని, అప్పటివరకూ తొక్కిసలాటను నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి రైతులకు న్యాయం చేయలేదన్నారు. రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో అప్పుల పాలవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల సమస్యలు గుర్తించి పరిష్కరించకుండా, సభలు, సమావేశాలు, రంగురంగుట ప్రకటనల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి,జి.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని రైల్వేమంత్రికి వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో రైల్వే సేవల అభివద్ధికి సంబంధించి కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌తో వైసీపీ లోక్‌సభ ఎంపీ మద్దిల గురుమూర్తి, రాజ్యసభ ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ మెంబర్ మేడా రఘునాథ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అభ్యర్థనలు చేశారు. తిరుపతి ప్రాంత రైల్వే వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయనకు వివరించారు. కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బాలాజీ రైల్వే డివిజన్‌ను తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా టిడిపి పార్లమెంటరీ ఫ్లోర్‌లీడర్ లావు కృష్ణదేవరాయులును బాలాజీ రైల్వే డివిజన్ సాధన కమిటి సభ్యులు కుప్పాల గిరిధర్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ పిసిరాయులు, ఫిల్మ్ సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సూరినేని బుజ్జి, బాబునాయుడు, సిటి జిఎం రామచంద్రారెడ్డి కలిసి వినతిపత్రం అందించారు.

రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉమ

ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు అందించే సబ్సిడీలను పథకాలను పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉమ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో రికార్డులను పరిశీలించి రైతన్నా మీకోసం వర్క్ షాప్‌లో రైతులతో మాట్లాడుతూ పేయి దూడలను పుట్టించే పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పీఎంబీఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, పశు వైద్యాధికారిని చందన ప్రియ, పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీలకు భద్రత కరువు

పుదుకుప్పం ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి - సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పుదుకుప్పం గ్రామంలోని పలు ఆలయాల్లో చోరీ జరిగింది. మండలంలోని పలు గ్రామాలలో దుండగులు ఆలయాలను లక్ష్యం చేసుకుని వరుస దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పుదుకుప్పం గ్రామంలోని మూడు ఆలయాల్లో చోరీ జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు... మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కొందరు ఆలయాల తలుపుల తాళాలను పగలగొట్టి లోనికి ప్రవేశించి అమ్మవారికి అలంకరించిన బంగారు ఆభరణాలతోపాటు హుండీలను పగలగొట్టి అందులోని నగదును అపహరించుకొని వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో అంకాలమ్మ దేవాలయంలో నాలుగు గ్రాముల బంగారు, రోజమ్మ గుడిలో మరో నాలుగు గ్రాముల బంగారు ఆభరణాలను, ఓం శక్తి గుడిలో హుండీ పగలగొట్టి దుండగులు దోచుకెళ్లినట్టు స్థానికులు ఆరోపించారు. మూడు ఆలయాల్లో అపహరించిన బంగారు ఆభరణాలు, హుండీ సొమ్ము సుమారు ఒక లక్ష పదివేల రూపాయలు విలువ చేస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. మండలంలో పలు ఆలయాలలో వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఇదంతా పథకం ప్రకారం ఓ ముఠా గ్రామాలను ఎంచుకొని ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్నారన్న అనుమానాన్ని కొందరు గ్రామస్తులు వ్యక్త పరుస్తున్నారు. గతంలో సత్యవేడు పట్టణం, మదనంబేడు, పేరడం గ్రామాల్లోని ఆలయాలలో చోరీకి పాల్పడి దోచుకెళ్ళారు. ఈ చోరీలపై పోలీసు వారు దష్టి సారించి సమగ్ర విచారణ చేసి దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. అవసరమైతే గ్రామాలలోని గుడుల వద్ద ప్రతిరోజు గస్తీ నిర్వహించి ఇలాంటి సంఘటనలు జరగకుండా నివారించాలని కోరుతున్నారు. స్థానిక ఎస్సై రామస్వామిని వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైం న్యూస్

కాపర్ వైర్లు చోరీ

ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండలంలోని సీఆర్ కండ్రిగ కాలనీకి చెందిన రైతు రమేష్ వ్యవసాయ పొలం వద్ద ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్లును గుర్తు తెలీని వ్యక్తులు చోరీ చేశారు. రైతు తెలిపిన మేరకు.. పొలం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైర్లు చోరీ చేశారని, దీనిపై పోలీసులు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో తరచూ ఇటువంటి చోరీలు జరుగుతూనే ఉన్నాయని, పోలీసులు చర్యలు తీసుకుని చోరీలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

సర్పంచ్ కుమారుడు మృతి

భౌతికకాయాన్ని సందర్శించిన పెద్దిరెడ్డి

కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నెల్లిమంద పంచాయతీ సర్పంచ్ చంద్రకళ, వెంకటరమణల కుమారుడు రోషన్ (31) బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందడంతో పుంగనూరు శాసనసభ్యులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విషయం తెలుసుకొని చింతలవారిపల్లె గ్రామంలో భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. యువనాయకులు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య మాధవి, కుమార్తె వైను, కుమారుడు షణ్ముఖ రాజు ఉన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అమాస మోహన్, నెల్లిమంద చంద్రశేఖర్, ఎంపీపీ ఈశ్వరయ్య, ఇరికిపెంట ఎంపీటీసీ వేములహరి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకండి..

రమేష్, ట్రైనింగ్ ఎస్సై

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలోని పుత్తూరు - చిత్తూరు జాతీయ రహదారికి ఇరువైపులా ఇతర వాహనాలకు ఇబ్బంది కలిగించేలా వాహనాలు నిలపరాదని ట్రైనింగ్ ఎస్సై రమేష్ తెలిపారు. బుధవారం వాహనదారులకు తమ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. రహదారిపై వాహనదారులు తమకు ఇష్టం వచ్చినట్లు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని తెలియడంతో ఆంధ్రాబ్యాంక్ వద్ద ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేసిన వాహనదారులకు కౌన్సింగ్ ఇచ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

తెలంగాణ గవర్నర్‌ను కలిసిన టిటిడి చైర్మన్

ప్రజాశక్తి -తిరుమల: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను హైదరాబాద్ గవర్నర్ బంగ్లాలో బుధవారం మర్యాద పూర్వకంగా టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు కలిసారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను స్వామి వారి శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందించారు. టిటిడిలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు రుచికరంగా, నాణ్యంగా ఉన్నాయని, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు భేషుగ్గా ఉన్నాయని గవర్నర్ అభినందించారు. త్రిపురలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. త్రిపురలో శ్రీవారి ఆలయానికి స్థలం కేటాయిస్తే ఆలయ నిర్మాణాన్ని టిటిడి చేపడుతుందని తెలిపారు.

టీటీడీ ఉద్యోగుల్లో భయం భయం..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కల్తీ నెయ్యి కేసులో నెక్ట్స్ అరెస్టయ్యేది ఎవరు..?

బ్రహ్మాండ నాయకుడి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కథ తెల్చే పనికి వేళయింది. కల్తీ నెయ్యి కేసు నిజాలు తేల్చే పనిలో ఉన్న సిట్ ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయబోతోంది. ఇప్పటికే 29 మంది నిందితులను కేసులో చేర్చి పలువురిని విచారించిన సిట్ 9 మందిని అరెస్టు చేసింది. మరికొద్ది మందిని నిందితులుగా చేర్చేందుకు మెమోలు దాఖలు చేసింది. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్ గా, ఈఓలుగా పనిచేసిన వారిని విచారించింది. డెయిరీ యాజమాన్యాలను, నిందితులను జైలుకు పంపింది. ఇప్పుడు టిటిడి అధికారుల అరెస్టులకు సిద్ధం కావడం.. ఇన్వెస్టిగేషన్ స్పీడ్ అవ్వడంతో.. ఉద్యోగుల్లో భయాందోళనలకు కారణం అయ్యింది. నెక్ట్స్ ఎవరంటూ తీవ్ర చర్చ జరుగుతోంది.

రిమాండ్ రిపోర్టులో సంచలన నిజాలు..

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు విచారణ తుది దశకు చేరుకుంది. ఎన్.డి.డి.బి కాఫ్ నివేదిక ఆధారంగా నెయ్యిలో కల్తీని గుర్తించిన టిటిడి శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న అభియోగాలు, ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చే పనిలో ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తోంది. సీబీఐ నేతత్వంలోని 5 మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బందం డిసెంబర్ 15 లోపు ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయాలని నిర్ణయించింది. సిట్‌లో సీబీఐ తరపున మురళి రాంబా కీలకంగా వ్యవహరిస్తుండగా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ పని పూర్తి చేస్తోంది.

క్షేత్రస్థాయిలో దర్యాప్తు పూర్తి చేసిన సిట్ అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ కేంద్రంగా ఏడాదిగా విచారణ చేస్తోంది.

ఇందులో భాగంగానే కల్తీ నెయ్యి కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే టీటీడీ ఉద్యోగుల్లో కల్తీ నెయ్యి కేసు భయం నెలకొంది. కేసులో ఏ 29 గా టీటీడీ ప్రోక్యూర్మెంట్ జిఎం గా పనిచేసిన సుబ్రహ్మణ్యం అరెస్ట్ కావడంతో ఫియర్ పిక్స్ కు చేరుకుంది. ఇప్పటికే నిందితులుగా ఉన్న ఉద్యోగులను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని భావిస్తున్న పరిస్థితి వెంటాడుతోంది. అంతేకాకుండా.. పలువురిని విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం..

సుబ్రహ్మణ్యం రిమాండ్ రిపోర్టులో కల్తీ నెయ్యి సరఫరాపై సంచలన విషయాలు బయటపడ్డాయి. కల్తీ నెయ్యిని స్వచ్ఛమైన ఆవు నెయ్యిగా టీటీడీకి సరఫరా జరిగేలా సహకరించింది సుబ్రహ్మణ్యమే నని సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. బోలే బాబా డెయిరీ నుంచి రూ. లక్షల్లో లంచం, విలువైన కానుకలు సుబ్రహ్మణ్యం అందుకున్నట్లు సిట్ నిర్ధారణకొచ్చింది. బోలే బాబా, వైష్ణవి డెయిరీలను తనిఖీ చేయడానికి వెళ్లిన అధికారులు విలువైన వస్తువులు, నగదు పొందినట్లు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసింది. కేసులో ఎ24 గా ఉన్న చిన్నఅప్పన్న కు సహకరించి నెయ్యి సప్లై చేసిన కంపెనీలతో సుబ్రహ్మణ్యంతో పాటు మరికొందరు లాలూచీ పడినట్లు సిట్ గుర్తించింది.

మైసూర్ ల్యాబ్ రిపోర్టును దాచి బోలే బాబా డెయిరీ కి రెండు దఫాల్లో దాదాపు 1.20 లక్షల కిలోల వరకూ నెయ్యి సరఫరాకు ఆర్డర్లను ఇవ్వడంలో సుబ్రహ్మణ్యం కీలకపాత్ర పోషించినట్లు సిట్ తెలిపింది. నెయ్యి సరఫరాకు సాంకేతికంగా అర్హత పొందిన సంస్థలకు లబ్ధి చేకూర్చేలా టెండర్ల ప్రక్రియను నిర్వహించేలా అప్పటి టిటిడి ప్రొక్యూర్మెంట్ జిఎం సుబ్రహ్మణ్యం ప్రయత్నించినట్లు సిట్ పేర్కొంది.

మరింత మంది పాత్రపై కోర్టులో మెమో..

మరోవైపు కల్తీ నెయ్యి కేసు దర్యాప్తును ముగించే దశలో ఉన్న సిట్ టిటిడి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాదులో, టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డిని తిరుపతిలో రెండు రోజులు పాటు విచారించింది. ఇలా కల్తీ నెయ్యి సరఫరా కేసులో అప్పటి పాలకమండలిని, అధికారులను, నెయ్యి సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులను, సహకరించిన వారిని విచారించింది. అయితే టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో ఉద్యోగుల పాత్ర కూడా కీలకమని సిట్ విచారణలో తేరడంతో ఇప్పుడు కొందరు ఉద్యోగుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎ24 నుంచి ఎ36 వరకు మరో 12 మంది నిందితులను కేసులో చేర్చేందుకు సిట్ సిద్ధమైంది. ఈ మేరకు నెల్లూరు కోర్టులో మెమో దాఖలు చేసింది.

నిందితుల్లో ఏడుగురు టిటిడి ఉద్యోగులు తోపాటు ఐదుగురు డెయిరీ లకు చెందిన వారుగా పేర్కొన్న సిట్ అధికారులు.. 2019 నుంచి టిటిడి ప్రొక్యూర్మెంట్ జనరల్ మేనేజర్ లుగా, వేర్ హౌసింగ్, గోశాల డయిరీ ఉద్యోగులు గా పనిచేసిన వారిని నిందితులుగా తేల్చింది. డెయిరీ శాంపిల్స్ సేకరించి నిపుణుల నివేదిక ఇవ్వాలని 2022 మే నెలలో అప్పటి టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశించగా ఇదే అదునుగా అక్రమాలు జరిగినట్లు సిట్ భావిస్తోంది.. 2018 నుంచి 2024 వరకు నెయ్యి సరఫరా చేసిన డెయిరీ ప్లాంట్ సందర్శించిన నిపుణులు కమిటీ నివేదికను, ల్యాబ్ రిపోర్టులను పక్కన పెట్టి ఇదే అవకాశంగా చేసుకుని కొందరు డయిరీ యాజమాన్యాల నుంచి ముడుపులు, కానుకలను పొందినట్లు సిట్ తేల్చింది. ఇలా కక్కుర్తి పడ్డ వారిలో నిపుణులు, టిటిడి ప్రొక్యూర్మెంట్ జీఎంలు, కొందరు ఉద్యోగులు ఉన్నట్లు సిట్ ఛార్జ్ షీట్ వేయబోతుండటం సంచలనంగా మారింది.

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI
CIVIL REVISION PETITION No.799/2020

Between:
Vathuluru Sundaram and 2 others ...**Petitioners**
AND
Mittapalli Kanakamma and 13 others ...**Respondents**

NOTICE TO RESPONDENT No.1

To
R1). Mittapalli Kanakamma, W/o M.Doraswamy Reddy, Age 62 years, Qcc; Cultivation, R/o. MarrimakulaKandriga, Mambedu Post, Védurukuippam Mandal, Chittoor District, Andhra Pradesh.

NOTICE

Madam,
It is submitted that a Civil Revision Petition bearing CRP No. 799 of 2020 is filed before the Hon'ble High Court of Andhra Pradesh, at Amaravathi by Vathuluru Sundaram, and 2 others against 14 Respondents aggrieved by the order dated 17-09-2019 passed in E.P. No. 22/2016 in OS No.236/2007 on the file of Principal Junior Civil Judge Cum Judicial 1st Class Magistrate, Puttur. It is further submitted that when the matter came up for admission the Hon'ble High court has directed us to send personal Notice to the Respondent no.1 [Mittapalli Kanakamma] in the CRP through register post and same was sent through register post and memo of proof service was also filed before the Hon'ble High Court on 29-08-2020 which was returned as unserved which was sent to respondent no.1. It is submitted that the Hon'ble High Court of Andhra Pradesh on 10-11-2025 and on 01-12-2025 when the matter was listed has directed us to take Substitute service in local news paper regarding filling of CRP No. 799 of 2020 to intimate the respondent no.1 about the pendency of the above mentioned Civil Revision Petition before Hon'ble High court of Andhra Pradesh At Amaravathi by way of publishing the notice in local news paper widely circulated in the area where the respondent no.1 i.e., Mittapalli Kanakamma is residing as per pleadings and directed the petitioner to file the proof of service of notice in the Honble High Court by way of new paper before 15/12/2025 and directed the registry to posted the matter to 15-12-2025. Hence Mrs. Mittapalli Kanakamma is requested to take notice and appear either in person or through a counsel in the above said Civil Revision Petition before the Hon'ble High court of Andhra Pradesh on 15-12-2025 and contest the case or else the matter will be decided on exparte.

//by court order//
V.NITESH
ADVOCATE